క్లుప్తంగా

సేవాభావంతో పనిచేయాలి



బస్టాండ్‌లో అన్నదానం చేస్తున్న సత్యసాయి సేవాసమితి సభ్యులు

ఆమనగల్లు: ప్రతి ఒక్కరూ సేవాభావంతో పని చేసి, పొరుగువారికి సాయం చేయాలని భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి ఆమనగల్లు కన్వీనర్ దొంతు శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో గురువారం సమితి ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయిబాబా ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభించారు. అనంతరం అన్నదానం చేశారు. సత్యసాయి మందిరంలో స్వామివారి భజన, మంగళహారతి పట్టారు. వేడుకల్లో సమితి సభ్యులు డాక్టర్ పుల్లయ్య, ప్రభాకర్, లింగం, బ్రహ్మం, శంకర్, శ్రీనివాస్, సంజీవ్‌కుమార్, తిరుపతయ్య, వెంకటేశ్, శ్రీనివాస్, సురేశ్, శ్రీదర్, రాజవర్ధన్‌రెడ్డి, అల్లాజి, శ్రీదర్, శ్రీశైలం, అలివేలమ్మ, సంధ్య, సింధు, అరుణ, అనిత, సునీత, సృజన, శైలజ, లావణ్య, దివ్య తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేతలు, కార్మికులు

ఇబ్రహీంపట్నం: కార్మికుల దినోత్సవం మేడే వేడుకలను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నంలో మేడే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మే ఒకటో తేదీన నిర్వహించే మేడేలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న, ఎల్లేశ్, బాలమణి, దశరథ, మహేశ్, యాదయ్య, కళమ్మ, భాస్కర్ పాల్గొన్నారు.

కమలనాథుడికి సన్మానం



రాజభూపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బీజేపీ శ్రేణులు

అబ్దుల్లాపూర్‌మెట్: బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్‌గౌడ్‌ను ఆ పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, కిసాన్‌మోర్చా మండల ఉపాధ్యక్షుడు కొండల్‌రెడ్డి, కొండల్ పాల్గొన్నారు.

పామాయిల్ సాగు.. లాభాలు బాగు



సదస్సులో మాట్లాడుతున్న డీజీఎం

ఆమనగల్లు: పామాయిల్ సాగుతో అధిక ఆదాయం పొందవచ్చునని పామాయిల్ డీజీఎం రామ్మోహన్ అన్నారు. ఆమనగల్లు మండలం శెట్టిపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పామాయిల్ సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలు, సాంకేతిక సమాచారం, పంట దిగుబడులు, విక్రయాలు తదితర అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ పామాయిల్ సాగు చేయడం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని, రైతులు అధిక లాభాలు అర్జించవచ్చని పేర్కొన్నారు. సాగుకు కూలీల అవసరం తక్కువగా ఉంటుందని, చీడపీడల బెడద ఉండదని వివరించారు. ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తుందని తెలిపారు. ఉద్యానవన శాఖ జిల్లా అధికారి సౌమ్య, వ్యవసాయ శాఖ ఏఈఓ భూదేవి, క్లస్టర్ అధికారి హిమకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీశైలం, రైతులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

షాబాద్: పశువులకు సీజన్‌గా వచ్చే వ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని రేగడిదోస్వాడ, షాబాద్ పశువైద్యాధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రవంతి సూచించారు. గురువారం అంతారం, సంకెపల్లిగూడ, బోనగిరిపల్లి గ్రామాల్లో పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేశారు. మే 13 వరకు శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.

కౌలు రాక.. నిధులు లేక!

ధూపదీప నైవేద్యాలకు నోచుకోని ఓంకారేశ్వరుడు!

- తరగని ఆస్తులున్నా ఆలయ అభివృద్ధి శూన్యం
- దేవుడి మాన్యంలో సాగు చేసుకుంటున్న రైతులు
- నామ మాత్రం రుసుం చెల్లించని కౌలుదారులు
- భూములకు హక్కు కల్పించాలంటున్న వైనం



నందివనపర్తిలోని ఓంకారేశ్వరాలయం (ఇన్‌సెట్లో) దేవతామూర్తులు



యాచారం: నందివనపర్తి ఓంకారేశ్వరుడికి రూ.వేల కోట్లు విలువ చేసే వందలాది ఎకరాల భూమి ఉంది. తరగని ఆస్తి ఉన్నప్పటికీ.. ఆ దేవతామూర్తులకు ధూపదీప నైవేద్యాలకు నిత్యం లోటే. ఆలయ భూములను కౌలు చేసుకుని జీవనోపాధి పొందుతున్న రైతులు ఇచ్చే కౌలు డబ్బులతో నిత్య పూజలు జరపాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆదేశం. కానీ కొద్దిపాటి కౌలు డబ్బులను నాలుగు గేళ్లుగా చెల్లించకపోగా, దేవుడి మాన్యం మాదేనంటూ పలువురు రైతులు మెలికపెడుతున్నారు. హక్కులు కల్పించాలంటున్నారు.

1,450 ఎకరాలు

ఓంకారేశ్వరుడికి నందివనపర్తి గ్రామం కేంద్రంగా నందివనపర్తి, నస్దిక్‌సింగారం, కుర్మిద్ద, తాడిపర్తిలో సర్వే నంబరు 148 నుంచి 267 వరకు 1,450 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో సుమారు 500 మందికి పైగా ఆయా గ్రామాల రైతులు వరి, కూరగాయలు, మామిడితోటల పెంపకంతో పాటు పౌల్ట్రీ, డెయిరీ పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని రూ.లక్షల్లో ఆదాయం పొందుతున్నారు. ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు.

కౌలు బదలాయింపు

ఆలయ భూముల్లో ప్రస్తుతం 1,253 ఎకరాల్లో రైతులు సాగు చేసుకుంటున్నారు. 20 ఏళ్ల క్రితం ఎకరా సారవంతమైన భూమికి రూ.వంద, మధ్యస్తమైన నేలకు రూ.80, పాడిపశువులు, అటవీ ప్రాంతం కలిగి ఉన్న దానికి రూ.60 చొప్పున కౌలు నిర్ణయించారు. ఇంత తక్కువగా కౌలు ఉన్నప్పటికీ.. కౌలు దారులు ఆలయానికి చెల్లించడం లేదు. రూ.లక్షల్లో పెండింగ్‌లో ఉన్నాయి. అంతే కాకుండా ఆ భూముల్లోని ఎర్రమట్టి, భారీ వృక్షాలను, నీటి విక్రయిస్తున్నారు. కౌలు బదలాయింపు చేస్తున్నారు. బదలాయింపుతో ఎకరా భూమిని రూ.రెండున్నర లక్షలకు పైగానే వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మట్టి అమ్మకాలపై ఆలయ ధర్మకర్త కుటుంబ సభ్యులు ఇప్పటికే యాచారం, గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫ్యూచర్‌సిటీ పక్కనే..

ఆలయ భూములు ఫ్యూచర్‌సిటీ పక్కనే ఉన్నాయి. ఫ్యూచర్ కింద మీరాఖాన్‌పేట, నందివనపర్తి, నస్దిక్‌సింగారం, అయ్యవారిగూడెం తదితర గ్రామాల్లో ఎకరా భూమి ధర రూ.4 కోట్లకు పైగా పలుకుతోంది. దేవుడి 1,450 ఎకరాల భూమి.. బహిరంగ మార్కెట్లో రూ.4 వేల కోట్లకు పైగా పలుకుతోంది. ఇందులో సాగులో లేని వెయ్యి ఎకరాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీకి తీసుకోవాలని చూసింది. దీనికి దేవాదాయ శాఖ ఓకే చెప్పింది. భూ విక్రయంతో వచ్చే ఆదాయంతో ఆలయాన్ని అభివృద్ధి చేసేలా సంకల్పించింది. కానీ అమలు కాలేదు.

రికార్డుల్లో ఓంకారేశ్వరుడి పేరు

ఆలయ భూముల్లో జీవనోపాధి పొందుతున్న రైతులు ఈ నెల 26,27,28 తేదీల్లో ఆలయానికి కౌలు బకాయి చెల్లించాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు ఆయా గ్రామాల్లో చాటింపు చేశారు. రైతుల నుంచి సుమారు రూ.15 లక్షలకు పైగానే రావాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. సక్రమంగా కౌలు చెల్లించి రశీదు పొందితేనే రెన్యువల్‌కు అర్హులవుతారని స్పష్టం చేస్తున్నారు. లేదంటే కౌలును రద్దు చేసి, ఆ భూముల నుంచి నిబంధనల ప్రకారం తొలగిస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని, ఆ భూములపై చట్టపరంగా హక్కులు కల్పించి, పట్టాదారు, పాసుపుస్తకాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. కానీ అధికార యంత్రాంగం మాత్రం.. దేవుడి మాన్యంపై రైతులకు ఎలాంటి హక్కు లేకుండా, రెవెన్యూ రికార్డుల్లో ఓంకారేశ్వరుడి పేరు నమోదు చేశారు.



సాగులో ఆలయ భూమి

హక్కు కల్పించాలి



నస్దిక్‌సింగారం గ్రామంలో 50 ఏళ్లుగా ఆలయ భూమినే నమ్ముకుని జీవనోపాధి పొందుతున్నాం. సాగుకు యోగ్యంగా మార్చడానికి రూ.లక్షలు ఖర్చు చేశాం. మా కుటుంబ సభ్యుల ఆధీనంలో 25 ఎకరాల భూమి ఉంది. హక్కులు కల్పించి, పట్టాదారు, పాసుపుస్తకాలు ఇవ్వాలి.

– ఆదిరెడ్డి రాజిరెడ్డి, కౌలు రైతు, నస్దిక్‌సింగారం

సహకరించాలి



ఆలయ భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులు.. కౌలు చెల్లించి సహకరించాలి. ఈ నెల 26,27,28 తేదీల్లో దేవాదాయ శాఖ అధికారులు ఆలయం వద్దే ఉంటారు. బకాయి మొత్తం చెల్లించాలి. నిబంధనలకు విరుద్ధంగా భూముల బదులాయింపు కానీ.. మట్టి, చెట్లను అమ్ముకోవడం నేరం.

– వెంకట శివకుమార్, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త

బకాయి చెల్లిస్తేనే రెన్యువల్



ఆలయ భూముల్లో సాగు చేసుకుని జీవనపోపాధి పొందుతున్న రైతులు.. రూ.లక్షల్లో ఆదాయం పొందుతున్నారు. కానీ ఎకరాకు రూ.60, 80, 100 లోపు నామమాత్రపు కౌలు రుసుం చెల్లించడం లేదు. రూ.15 లక్షలకు పైగా బకాయి ఉంది. బకాయి చెల్లిస్తేనే.. ఆ రైతు పేరిట కౌలు రెన్యువల్ చేస్తాం.

– శ్రీనువాస్‌రావు, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

పక్కాగా.. లబ్ధిదారుల ఎంపిక

ఇందిరమ్మ ఇళ్లపై రీ సర్వే

- కమిటీలు ఇచ్చిన జాబితాపై కసరత్తు
- రేపటి లోగా నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశం
- రంగంలోకి ప్రత్యేక అధికారులు..
- పట్నం మండలంలో 2,374 జీఎల్1

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశ పెట్టింది. ప్రజాపాలన చేపట్టి, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. అర్హుల జాబితాపై విస్తృతంగా సర్వే చేయించింది. పక్కాగా నిజమైన పేదలకే ఇళ్లు దక్కాలని మరోసారి సర్వేకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన లిస్టుపై అధికార యంత్రాంగం తీవ్ర కసరత్తు చేస్తోంది.

మరోసారి..

ఇబ్రహీంపట్నం మండలంలో 14 గ్రామాలు ఉన్నాయి. వీటిల్లో పైలెట్ ప్రాజెక్టుగా కప్పపహాడ్‌ను ప్రభుత్వం ఎంపిక చేసింది. 94 ఇళ్లను లబ్ధిదారులకు లెవల్–1లో మంజూరు చేసింది. ఇప్పటికే 50 శాతం పైగా నిర్మాణం చేశారు. తొలి విడతలో అశ్విని అనే లబ్ధిదారుకు రూ.లక్ష ఆమె ఖాతాలో జమ చేశారు. ఇదిలా ఉండగా.. మండలంలో అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిని గ్రౌండ్ చేయాలని సూచించింది. కప్పపహాడ్ మినహాయిస్తే.. చర్లపటేల్‌గూడ, కర్ణంగూడ, తులేకలాన్, ఎల్మినేడు, పోచారం, రాయపోల్, పోల్కంపల్లి, దండుమైలారం, నాగన్‌పల్లి, ముకునూర్, నెర్రపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన నివేదక ఆధారంగా ప్రభుత్వం రీ సర్వేకు ఆదేశించింది.

22 నుంచి 26 వరకు..

ఈ నెల 22వ తేది నుంచి 26 వరకు సమగ్రంగా 360 డిగ్రీల కోణంలో సర్వే చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో ప్రస్తుతం సర్వే కొనసాగుతోంది. 13 గ్రామాల్లో 2,374 ఇళ్లపై సర్వే షురూ అయింది. మొదటి రెండు రోజులు 280 ఇళ్లు పూర్తి చేశారు. ఇందులో గెజిటెడ్ అధికారులు ఎంపీఓ రఘు, ఆర్అండ్‌బీ ఏఈ వినోద్, మండల వ్యవసాయ అధికారి విద్యాధరి, ఇరిగేషన్ డీఈ చెన్నకేశవరెడ్డి ఉన్నారు. ఇదిలా ఉండగా.. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు ఇప్పటికే అర్హుల జాబితాను సిద్ధం చేశారు. ప్రభుత్వం ఆదేశించిన ప్రకారం తొలి విడతలో నిజమైన అర్హులకే ఇళ్లు మంజూరు చేయనున్నారు. పారదర్శకంగా రూపొందించిన లిస్టు.. ఎంపీడీఓలకు చేరింది.



నిర్మాణంలో ఇందిరమ్మ ఇల్లు

దశల వారీగా..



ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ వేగవంతం అయింది. నిజమైన అర్హులను ఎంపిక చేస్తాం. ప్రభుత్వం ఇచ్చిన 2,374 ఇళ్ల సర్వే 26వ తేది వరకు పూర్తి చేస్తాం. నివేదిక అందజేస్తాం. ఇందిరమ్మ కమిటీల సమన్వయంతో పని చేస్తున్నాం. అర్హులందరికీ ఇళ్లు అందేలా కృషి చేస్తున్నాం. దశల వారీగా సొంతింటి కల నెరవేరుస్తాం.

– వెంకటమ్మ, ఎంపీడీఓ, ఇబ్రహీంపట్నం

నేడు భూభారతిపై అవగాహన సదస్సు

మాడ్గుల: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఆర్ఓఆర్ భూ భారతి 2025 చట్టంపై మాడ్గుల మండల కేంద్రంలోని వాసవి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వినయ్ సాగర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమంలో ప్రజలు, రైతులు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొనాలన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం

షాద్‌నగర్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫలితాల్లో సత్తాచాటిన పట్టణ యువతి ఇంద్రార్చితను నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న యువతి ఇంటికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో పాటు ఆయా పార్టీల నాయకులు వెళ్లి శాలువాలు కప్పి సన్మానించారు. పట్టుదలతో చదివి సివిల్స్‌లో ర్యాంకు సాధించడంతో ఆమెకు వారందరూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విశ్వం, బస్వం, కొంకళ్ల చెన్నయ్య, కొందూటి నరేందర్, ఎంఎస్ నటరాజన్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ఇంద్రార్చితను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

దళారులను నమ్మి మోసపోవద్దు

మార్కెట్ కమిటీ ఛైర్మన్ గురునాథ్‌రెడ్డి

యాచారం: దళారులకు ధాన్యం విక్రయించి రైతులు మోసపోవద్దని ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి అన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో మంతన్‌గౌరెల్లి, నందివనపర్తి గ్రామాల్లో గురువారం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో నిర్వాహకులు నాణ్యత, తూకం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. ఈ కారణంతో రైతులు కొనుగోలు కేంద్రాలపై ఆసక్తి చూపడం లేదని, ధర తక్కువున్నా, తూకంలో మోసం చేస్తున్నా దళారులనే ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలో వారం రోజుల వ్యవధిలో డబ్బులు జమ చేయాలని సూచించారు. కార్యక్రమంలో యాచారం మండల వ్యవసాయ అధికారి రవినాథ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్ రెడ్డి, మండల అధ్యక్షుడు నర్సింహ, జోగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నందివనపర్తిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న గురునాథ్‌రెడ్డి

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కండి

- ఎంపీడీఓ లాలయ్య
- జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

కడ్తాల్: గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ లాలయ్య అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో ఎంపీఓ అధ్యక్షతన గ్రామాల్లో చేపట్టవలసిన అభివృద్ధి పనుల గురించి చర్చించారు. పారిశుద్ధ్య, మురుగునీటి నిర్వహణ, ఓడీఎఫ్, ఇంకుడు గుంతలు, పోషకాహారం, నీటి వినియోగం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓతో పాటు ఎన్ఐఆర్‌డీపీఆర్ ప్రతినిధి నిధిసింగ్, కార్యదర్శి అల్లాజీ, మార్కెట్ వైస్ ఛైర్మన్ భాస్కర్ రెడ్డిలను స్థానిక నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, రాజు, నాయకులు మహేశ్, ఎల్లగౌడ్, చందోజీ, రమేశ్, రవి, శ్రీశైలం, భానుకిరణ్, వెంకటయ్యగౌడ్, రమేశ్ ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ లాలయ్య

భక్తిభావం పెంపొందించుకోవాలి



ఉత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తదితరులు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటాపూర్ శ్రీలక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణం గురువారం ఘనంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య మాంగల్యధారణ గావించారు. ఉత్సవానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, శతాబ్ది టౌన్‌షిప్ ఛైర్మన్ శ్రీనివాసురెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ కేశవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఆలయ క్రియాశీలక సభ్యులు, మాజీ సర్పంచ్ రమేష్‌యాదవ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు ముజీబర్ రహ్మాన్, బీసీ సంఘం జాతీయ మాజీ సభ్యుడు ఆచారి, టాస్క్ సీఈఓ, ఐక్యతా ఫౌండేషన్ ఛైర్మన్ రాఘవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారిని సాదరంగా ఆహ్వానించి, శాలువాలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భక్తిభావం పెంపొందించుకోవాలని సూచించారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం



నందివనపర్తిలో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాల వద్ద కాంగ్రెస్ నాయకులు

యాచారం: రాజ్యాంగాన్ని కేంద్ర ప్రభుత్వం అపహాస్యం చేస్తుందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. గురువారం మండల పరిధి మంతన్‌గౌరెల్లి, చింతపట్ల, నందివనపర్తి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ జెండాలను, గాంధీ, అంబేడ్కర్‌ల చిత్రపటాలు, జాతీయ జెండాలు, రాజ్యాంగ పుస్తకాలతో ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి, గిరిధర్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గురునాథ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహ, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనువాస్‌రెడ్డి, బీఎస్ఆర్ ట్రస్ట్ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మంతన్‌గౌరెల్లి మాజీ ఎంపీటీసీ అరవింద్‌నాయక్ ఉన్నారు.

ఉగ్రవాదం దేశాభివృద్ధికి ఆటంకం



ఇబ్రహీంపట్నంలో.. బీఆర్ఎస్ నాయకుల ర్యాలీ



అబ్దుల్లాపూర్‌మెట్‌లో.. బీజేపీ శ్రేణుల ర్యాలీ

- పర్యాటకులపై దాడికి నిరసనగా సకల జనుల ర్యాలీలు
- ముష్కరులను మట్టుపెట్టాలని ముక్తకంఠంగా డిమాండ్

ఇబ్రహీంపట్నం: ఉగ్రవాదం దేశాభివృద్ధికి ఆటంకం కలుగుతుందని సైంట్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ కె.చంద్రశేఖర్‌రెడ్డి, విద్యార్థులు ఆందోళన వ్యక్తంచేశారు. కశ్మీర్ పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ముష్కరుల దాడిని నిరసిస్తూ.. గురువారం ఇబ్రహీంపట్నంలో శాంతి ర్యాలీని నిర్వహించారు. మృతులకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో అన్ని మతాలు వారు ఐకమత్యంతో జీవిస్తున్నారన్నారు. ఇలాంటి ఉగ్రదాడులు చేసి, అలజడులు సృష్టించి, ఐక్యతను దెబ్బతీయాలని చూడటం వారి అవివేకమే అవుతుందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, ఉగ్రవాదంపై ఉక్కుపాదం కోరారు. శాంతి ర్యాలీ.. బస్ డిపో నుంచి అంబేడ్కర్ కూడలి వరకు సాగింది. కార్యక్రమంలో ఆ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి.వేణుగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ డాక్టర్ జి.అనిల్‌కుమార్, డాక్టర్ హరికృష్ణ, ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

పిరికిపంద చర్య

కశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్ర దాడి పిరికిపంద చర్య అని, ఇది మానవత్వానికి మాయని మచ్చని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. దాడికి నిరసనగా.. గురువారం రాత్రి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు కేంద్ర ప్రభుత్వం తగిన రీతిలో బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృపేశ్, బీఆర్ఎస్ నాయకులు అల్వాల వెంకట్‌రెడ్డి, బుగ్గరాములు, ఆకుల యాదగిరి, ఏనుగు భరత్‌రెడ్డి, జెర్కొని రాజు, శేఖర్, నిట్టు జగదీశ్వర్, శివసాయి, వేణు గోపాల్‌రావు, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్: పర్యాటకులపై ఉగ్రదాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్ అన్నారు. అమాయకులను హతమార్చిన ముష్కరులను మట్టుపెట్టాలని కోరారు. పహల్గాం దాడులకు నిరసనగా.. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో గురువారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మృతులకు నివాళి అర్పించారు. బీజేపీ జిల్లా నాయకులు గోవర్ధన్‌గౌడ్, రమాదేవి, జంగమయ్య, వీరస్వామి, సురేష్‌గౌడ్, లింగం, రామకృష్ణ పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: పర్యాటకులపై ఉగ్రదాడులు హేయమని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శివ కుమార్ గౌడ్‌లు అన్నారు. పౌరులపై ముష్కరుల దాడిని ఖండిస్తూ తుర్కయంజాల్‌లో నిరసన వ్యక్తంచేశారు. మృతులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు భాస్కర్, ప్రసాద్, సురేష్, జంగయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్‌లో.. సీపీఐ నాయకులు